క్లుప్తంగా

బాధితుడికి ఆర్థిక సాయం


శంకర్‌ను పరామర్శిస్తున్న అర్షద్ హుస్సేన్

బెజ్జూర్: బహుజన సమాజ్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ ఉదారత చాటారు. మండల కేంద్రంలోని సూర్ల శంకర్ కొద్దిరోజుల క్రితం ప్రమాదానికి గురై గాయాల పాలయ్యాడు. విషయం తెలుసుకున్న బీఎస్పీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ సోమవారం ఆయన ఇంటికి చేరుకొని పరామర్శించారు. బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు సూర్ల ఇస్తారి, సల్మాన్ ఖాన్, గాండ్ల మల్లేష్, గంగాధర్, రంజిత్ తదితరులు ఉన్నారు.

చింతలమానెపల్లి ఎంపీవోగా సుధాకర్ రెడ్డి

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి మండల పంచాయతీ అధికారిగా కె.సుధాకర్ రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన కౌటాల ఎంపీవోగా పనిచేస్తూ బదిలీపై మండలానికి వచ్చారు. మండల ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన ఈసందర్భంగా తెలిపారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన

చింతలమానెపల్లి: తెలంగాణ గ్రామీణ బ్యాంకు అందిస్తున్న సేవలను ఉపాధిహామీ కూలీలు వినియోగించుకోవాలని బ్యాంకు మేనేజర్ నరసింహ స్వామి అన్నారు. సోమవారం మండలంలోని డబ్బా గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. వారికి ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు బ్యాంకులో పొదుపు చేయాలన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో సోమవారం మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. 16వ శతాబ్దపు కవయిత్రి మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షుడు కుమ్మరి మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షుడు విలాసాగర్, నాయకులు తిరుపతి, రంగయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న క్రిష్ణమాచారి

దహెగాం: మండల కేంద్రంలోని రైతు కేంద్రం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించ తలపెట్టిన భవన నిర్మాణ కార్మిక మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు క్రిష్ణమాచారి పిలుపునిచ్చారు. మండలంలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి న్యాయమైన హక్కుల కోసం పోరాడాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు అంజయ్య, మహేష్, శంకర్, చంద్రయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీవో క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం తెలంగాణ జిల్లా నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ అసోసియేషన్ 2023 సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ హేమంత్ బొర్కడే సహదేవ్ రావు సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు సిడాం పోచయ్య, కార్యదర్శులు లింగాల రాజశేఖర్, మహిళా వైస్ ప్రెసిడెంట్ కరణశ్రీ, కోశాధికారి పృథ్వి, కుమార్, మధుకర్, శ్రీనివాస్, చందన, కౌసల్య, అంకూస్, గురువయ్య, రఫత్, కీర్తిపాల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కార్తీక్ మహరాజ్ ఆలయ కమిటీ ఎన్నిక

కౌటాల: మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామ సమీపంలోని కార్తీక్ మహరాజ్ ఆలయ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా నాగపురె శ్యాంరావు, ఉపాధ్యక్షుడిగా మడావి రాందాస్, కోశాధికారులుగా సంతోష్, సచీవ్, రమేష్, కార్యనిర్వాహకులుగా బాబ్‌రావ్, కమిటీ సభ్యులుగా తుసె సంతోష్, సాయినాథ్, సునీల్, గణపతిలను ఎన్నుకున్నారు.

స్వయం ఉపాధి వైపు అడుగులు!


శిక్షణ పొందుతున్న కొలాం ఆదివాసీలు

- వెదురుతో వస్తువుల తయారీపై శిక్షణ
- ఆసక్తి చూపుతున్న 'కొలాం'లు
- ఐటీడీఏ, డబ్ల్యూసీఎస్‌ల ఆధ్వర్యంలో నిర్వహణ

తిర్యాణి: ఆదివాసీల్లో అత్యంత వెనుకబడిన కొలాంలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఐటీడీఏ, డబ్ల్యూసీఎస్ (వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ సొసైటీ)ల ఆధ్వర్యంలో మండలంలోని మంగి పంచాయతీ పరిధిలోని కొలంగూడలో వెదురు బొంగులతో వస్తువుల తయారీ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. గత రెండు నెలలుగా ఆసక్తి కలిగిన 25మంది కొలం ఆదివాసీలకు ఇందులో శిక్షణ ఇస్తున్నారు.

రకరకాల వస్తువుల తయారీ..

శిక్షణ కేంద్రంలో వెదురు బొంగులతో వివిధ రకాల వస్తువుల తయారీపై శిక్షణ అందిస్తున్నారు. ఇందులో భాగంగా కొలాం ఆదివాసీలు పెన్ను బాక్స్, సెల్ ఫోన్ బాక్స్, ఫ్లవర్ బొకే, బెడ్ ల్యాంప్, టేబుల్ ల్యాంప్, ఆఫీస్ ఫైల్ వంటి 22 రకాల వస్తువుల తయారీపై శిక్షణ పొందుతున్నారు. కాగా శిక్షణ పొందుతున్న ప్రతీ ఒక్కరికి రోజుకు రూ.100 చొప్పున స్టైఫండ్ అందజేస్తున్నారు. మొదట నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వాలని అధికారులు భావించారు. నెల రోజుల్లో కేవలం ఐదు రకాల వస్తువుల తయారీ మాత్రమే నేర్చుకోవడంతో శిక్షణ సమయాన్ని నెల నుంచి మూడు నెలలకు పొడిగించారు. శిక్షణ పూర్తయిన తరువాత శిక్షణ పొందిన వారితో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. వారి ఆధ్వర్యంలో తయారైన వస్తువులను మార్కెటింగ్ చేసేందుకు సైతం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.


శిక్షణలో తయారు చేసిన వస్తువులు

శిక్షణ ఉపయోగకరం



మాకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో మా గ్రామంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్నాం. వెదురు బొంగులతో వివిధ రకాల వస్తువులను ఎలా తయారు చేయాలో నేర్చుకుంటున్నాం.

– టేకం చిన్ను, కొలంగూడ

రోజుకు రూ.100 ఇస్తున్నారు



మాకు శిక్షణతో పాటు రోజుకు రూ.100 చొప్పున స్టైఫండ్ కూడా అందజేస్తున్నారు. శిక్షణ కేంద్రానికి వస్తున్న వారికి అన్ని వస్తువుల తయారీ విధానం వచ్చే వరకు శిక్షణ కేంద్రాన్ని కొనసాగించాలి.

– టేకం భీంరావు, కొలంగూడ

'మార్కెటింగ్' కల్పిస్తాం

కొలాంలకు శిక్షణ ముగిశాక, వారు స్వయంగా తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తాం. ప్రస్తుతం 25 మందికి శిక్షణ ఇస్తున్నాం. ఆదివాసీలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

– కుమార్, డబ్ల్యూసీఎస్ కోఆర్డినేటర్

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

బెజ్జూర్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ డోకె రోజారమణి అన్నారు. సోమవారం మండలంలోని కాటపెల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ శిబిరం ద్వారా ప్రతీ ఒక్కరికి కంటి పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి కంటి అద్దాలు సైతం పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, మండల సహకార సంఘం మాజీ చైర్మన్ డోకె వెంకన్న, సర్పంచ్ సిడాం భీంరావ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంజిరి రాజారామ్, బొర్కుట్ తులసీరామ్, జలపతి, శైలం, కార్యదర్శి మారుతి, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రోజారమణి

'టీబీజీకేఎస్‌తోనే కార్మికులకు హక్కులు'

రెబ్బెన: టీబీజీకేఎస్‌తోనే సింగరేణి కార్మికులు అనేక హక్కులు సాధిస్తున్నట్లు యూనియన్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్‌లో సోమవారం టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూనియన్ నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వర్క్‌షాపునకు చెందిన పలువురు కార్మికులు టీబీజీకేఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కృషితో కోల్ ఇండియాలో కూడ లేని అనేక హక్కులను సింగరేణి కార్మికులు సాధించారన్నారు. సింగరేణిలో ఎప్పుడు గుర్తింపు ఎన్నికలు వచ్చిన సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్‌రావు, చర్చల ప్రతినిధి మంగీలాల్, ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరావు

జాగృతి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు

రెబ్బెన: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను జాగృతి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జాగృతి మండల కన్వీనర్ కుందారపు శంకరమ్మ, సర్పంచ్ అహల్యాదేవిలు కేక్‌కట్ చేసి మహిళలకు స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, నాయకులు లత, శారద, లక్ష్మి, పార్వతి, మడ్డి లక్ష్మి పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను సోమవారం స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో ఘనంగా నిర్వహించారు. జాగృతి జిల్లా కన్వీనర్ పర్వ చంద్రశేఖర్, తాలుకా కన్వీనర్ డోకె దామోదర్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.


రెబ్బెన: కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలకు జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి హాజరయ్యారు. కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో గోలేటి సర్పంచ్ పోటు సుమలత, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి

కెరమెరి: కార్గో సేవలను వినియోగదారులు సద్వినియోగం చేయాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం అన్నారు. సోమవారం మండలంలోని సుల్తాన్‌గూడలో గల ఖాన్ ఆన్‌లైన్ సెంటర్‌లో టీఎస్ఆర్టీసీ కార్గో సేవలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుజా యిత్ ఖాన్, కార్గో నిర్వాహకుడు సయ్యద్ ఖాన్, ఉపసర్పంచ్ నిసార్, టీఆర్ఎస్ నాయకులు రాథోడ్ ఉత్తం నాయక్, షేక్ యూనూస్, దండుగుల శ్రీనివాస్, ఖుత్‌బోద్దీన్, ఆర్టీసీ సిబ్బంది మల్లేశ్ తదితరులు ఉన్నారు.


కార్గో సేవలు ప్రారంభిస్తున్న ఎంపీపీ మోతిరాం

సర్‌సిల్క్ కాలనీలో మహిళా దినోత్సవం

కాగజ్‌నగర్‌టౌన్: బీఆర్ఎస్ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు మామిడాల మమత ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సర్‌సిల్క్ కాలనీలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. రూరల్ ఎస్సై సోనియా, కోనేరు విజయ, మహిళా సంఘం ప్రతినిధులు రాణి, నీరజ, మంజుల, అరుణ, అనిత, మల్లేశ్వరి, ఝాన్సీ, సుజాత, పద్మ, శారద, విమల తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నార్నూర్: మహాలక్ష్మి మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీహెచ్‌సీ (రైతులకు వ్యవసాయ పని ముట్లు అద్దెకు ఇచ్చే కేంద్రం) సెంటర్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అడ చంద్రకళరాజు అన్నారు. సోమవారం గాదిగూడ మండల కేంద్రంలోని మహాలక్ష్మి మండల సమాఖ్య కార్యాలయంలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్కువ ధరలకే వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్ అద్దెకు ఇవ్వడం ద్వారా రైతులు లబ్ధి చేకురుతుందన్నారు.

నార్నూర్ తహసీల్దార్‌గా మోతిరాం

నార్నూర్: మండల తహసీల్దార్‌గా ఆర్కా మోతిరాం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. గ్రామాల్లో ఎలాంటి భూ సమస్యలు ఉన్నా.. నేరుగా సంప్రదించాలని కోరారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఆదిలాబాద్‌టౌన్: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ ఆదిలాబాద్ అర్బన్ సీడీపీవో వనజా అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రం 1లో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ముందుగా గర్భిణులకు చీరలు, గాజులు అందజేసి సీమంతం జరిపారు.

నంబాలలో ఉచిత దంత వైద్య శిబిరం

రెబ్బెన: హెల్ప్ ఏజ్ ఇండియా, ఇన్ఫర్ సంస్థల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ చెన్న సోమశేఖర్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా దంతాలు సైతం అమర్చటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యుడు అజయ్, హెల్ప్ ఏజ్ ఇండియా కోఆర్డినేటర్ శివకృష్ణ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు అజయ్, పక్కన సర్పంచ్ సోమశేఖర్

అటెన్షన్ ప్లీజ్..

నెరవేరని లక్ష్యం



తిర్యాణి: గ్రామస్తులకు ఆహ్లాదం అందించాలనే ఉద్దేశంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని కన్నెపెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలో కొన్ని మొక్కలు కాలిపోగా, మరికొన్ని మొక్కలు ఎండిపోయాయి. అధికారులు సంరక్షణ చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సంబంధిత అధికారి: భారతి, పంచాయతీ కార్యదర్శి, కన్నెపెల్లి

క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న బషారత్ ఖాన్


టోర్నమెంట్ ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాస్

బెజ్జూర్: క్రీడలతో యువకుల్లో స్నేహభావం పెంపొందుతుందని కోఆప్షన్ సభ్యుడు బషా రత్ ఖాన్ అన్నారు. మండలంలోని అంబాగట్ట గ్రామంలో సోమవారం కోనేరు యువసేన క్రికెట్ పోటీలను గ్రామ సర్పంచ్ తిరుపతి, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు యువత క్రీడలపై ఆసక్తి కనబర్చాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడాపోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సి డాం సకారాం, నాయకులు సడ్మెక పురుషో త్తం, అహ్మద్, గణపతి, విజయ్, తొగయ్య, వెంకటి, రాజు, మంజూర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటల్లో స్నేహభావం ప్రదర్శించాలి

వాంకిడి: వివాదాలకు తావు లేకుండా ఆటల పోటీల్లో క్రీడాకారులు స్నేహభావం ప్రదర్శించాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని బెండార గ్రామంలో దీపక్‌ముండె యువసేన, బెండార ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్నిస్ బాల్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్సై డి.సాగర్, దీపక్ ముండెతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.33,333, రన్నరప్ జట్టుకు రూ.11,111ల నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు అన్నారావు, గణేష్, పాండు, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ అన్నారు. మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ మెమోరియల్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. గెలుపొందిన ముత్తంపేట్ జట్టుకు నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు రాంప్రసాద్, ఉప సర్పంచ్ వెంకటేశ్, నాయకులు ప్రవీణ్, సంతోష్, అనిల్, నిర్వాహకులు రాహుల్, లోహిత్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన: ఉపాధిహామీ పనులను మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. సోమవారం రెబ్బెన పంచాయతీలో రూ. 9.27లక్షల ఉపాధి నిధులతో చేపట్టిన రైతుల పొలాలకు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతుల కోసం ఉపాధిహామీ పథకంలో అనేక రకాల పనులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంట పొలాలకు వెళ్లేందుకు ఈజీఎస్ ద్వారా రోడ్డు సౌకర్యం కల్పించుకోవచ్చని రోడ్డు సౌకర్యం కావాల్సిన వారు ఈజీఎస్ సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మధునయ్య, ఏపీవో బుచ్చన్న, బీఆర్ఎస్ నాయకులు బొమ్మినేని శ్రీధర్, ఫీల్డ్ అసిస్టెంట్ తుకారాం తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సంతోష్

ప్రైవేట్ పనులకు పంచాయతీ ట్యాంకర్



తిర్యాణి: గ్రామ అవసరాల కోసం వాడాల్సిన పంచాయతీ వాటర్ ట్యాంకర్‌ను యథేచ్ఛగా ప్రైవేట్ పనులకు వినియోగిస్తున్నారు. తిర్యాణి గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్‌ను చిన్న అరటిపెల్లి గ్రామంలో చేపడుతున్న చెక్‌డ్యామ్ నిర్మాణ పనులకు వినియోగిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి అంజయ్యను వివరణ కోరగా సదరు కాంట్రాక్టర్‌కు రోజుకు రూ.2000లకు అద్దెకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామంలో నాటిన మొక్కలకు నీళ్లు పట్టడంతో పాటు ఇతర పనులకు వాడాల్సిన ట్యాంకర్‌ను ప్రైవేట్ పనులకు అద్దెకివ్వడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.